
పోలీసు కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద నీరు నిలవడంతో ట్రాఫిక్‌ను మరో దారిలో మళ్లిస్తున్న పోలీసులు


శ్రీనగర్‌కాలనీలో ట్రాఫిక్‌జామ్


అమీర్‌పేట మైత్రివనం ఎదుట రోడ్డుపై నిలిచిన వర్షం నీరు


శ్రీనగర్‌కాలనీ ప్రధాన రోడ్డులో నిలిచిన వరదనీరు

భారీ వర్షం.. అతలాకుతలం

● రోడ్ల మీద నిలిచిన వరదనీరు ● పలుచోట్ల ఇళ్లలో తడిసిన నిత్యావసరాలు ● ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకాలు


మోడల్ హౌస్ వద్ద నిలిచిన వరదనీరు

బంజారాహిల్స్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షానికి జనజీవనం అతలాకుతలమైంది. గురువారం మధ్యాహ్నం వరకు ఎండ ఉన్నప్పటికి ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చోటుచేసుకుంది. కుండపోత వర్షం కురవడంతో ఉద్యోగులు, విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. అమీర్‌పేట మైత్రీవనం, పంజాగుట్ట మోడల్‌హౌస్, సోమాజిగూడ కేసీపీ గెస్ట్ హౌస్ వద్ద మోకాలిలోతు నీరు నిలిచింది. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12 పోలీసు కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద నీరు నిలవడంతో ట్రాఫిక్‌ను మళ్లించారు.


అంబేడ్కర్‌నగర్‌లో కూలిన మెట్ల దారి

వర్షానికి కూలిన మెట్ల దారి

ఫిలింనగర్ అంబేడ్కర్‌నగర్‌కు దారి తీసే మెట్ల రోడ్డు బుధవారం రాత్రి కురిసిన వర్షానికి కూలింది. గతంలో పలుసార్లు మెట్ల దారిని తొలగించాలని వేడుకున్నా పాలకులు, అధికారులు పట్టించుకోలేదని స్థానికులు ఆరోపించారు. స్థానిక కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ గురువారం బస్తీలో పర్యటించి మెట్ల మార్గాన్ని పరిశీలించారు. వెంటనే రోడ్డు నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను కోరారు.

గాయత్రీనగర్‌లో వరద బాధితుల ఆందోళన


గాయత్రీనగర్‌లో ఆందోళన చేస్తున్న స్థానికులు

అమీర్‌పేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట పరిధిలోని గాయత్రీనగర్, బుద్ధనగర్, గంగుబాయి బస్తీల్లోని ఇళ్లలోకి వర్షంనీరు చేరింది. గాయత్రీనగర్ వాసులు తమకు న్యాయం కావాలని గురువారం రోడ్డెక్కారు. దెబ్బతిన్న ఎలక్ట్రానిక్ వస్తువులను పట్టుకుని వరద ఫొటోలతో నిరసనకు దిగారు. సత్యం టాకీస్ నుంచి మైత్రివనం, మైత్రివనం ప్రధాన రహదారి పై వర్షం నీరు చెరువులను తలపించాయి. దీంతో ఎర్రగడ్డ నుంచి పంజాగుట్ట వరకు ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోయి వాహనదారులు నానా అవస్థలు పడ్డారు. సనత్‌నగర్ కేఎల్ఎన్‌వై పార్కు నుంచి 60 ఫీట్ రోడ్డు ద్వారా పెట్రోల్‌బంక్ వరకు నీరు చేరి రోడ్డును ముంచెత్తింది.

ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయం బంద్


ప్రభుత్వ ముద్రణాలయంలో నిలిచిన వర్షంనీరు

ఖైరతాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్‌లోని ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయంలోకి భారీగా వర్షంనీరు చేరింది. గురువారం ఉదయం వరకు అవి పోకపోవడంతో ఉద్యోగులు లోపలికి వెళ్లలేక పోయారు. ఉదయం 7 గంటలకే ఉద్యోగులు అక్కడకు వచ్చినా ముద్రణాలయం నీట మునగడంతో బయటే కాలక్షేపం చేశారు. మధ్యాహ్నం విధులకు వచ్చిన వారు సైతం లోపలికి వెళ్లలేక యూనియన్ల కార్యాలయాల్లో కాలక్షేపం చేసి వెళ్లిపోయారు. కేవలం రెండు మోటర్లతో అటు ఓల్డ్ సీబీ క్వార్టర్స్ ఇటు ముద్రణాలయంలోని నీటిని తోడేసరికి సాయంత్రం అయింది. అప్పుడు మళ్లీ వర్షం పడడంతో ఉద్యోగులకు అప్రకటిత సెలవు ఇచ్చినట్లయింది.

మునిగిన కట్టగంగమ్మ ఆలయం


వర్షంనీటిలో కట్టగంగమ్మ ఆలయం

భారీ వర్షానికి ఐమాక్స్ ఎదురుగా ఉన్న కట్టగంగమ్మ ఆలయం నీట మునిగింది. ఇటీవలే వర్షం నీరు వెళ్లేందుకు వేసిన పైపులైన్‌కు గంగమ్మ ఆలయం వద్దకు చేరుకునే నీరు వెళ్లేలా అనుసంధానం చేశారు. భారీ వర్షానికి పైపులైన్‌లోని నీరు రివర్స్ రావడంతో గంగమ్మ ఆలయం సగం వరకు మునిగింది. అందులో అమ్మవారు పూర్తిగా నీటమునగడం విశేషం. ఇక మారుతీనగర్, రాజ్‌నగర్‌తో పాటు ఎంఎస్ మక్తా ఇండ్లలోకి నీరు చేరుకున్నాయి. మారుతీనగర్ నాలా నుంచి నీరు పైకి వచ్చి అటు రాజ్‌నగర్, ఇటు మారుతీనగర్‌లను ముంచెత్తాయి.

నిండా మునిగిన ఓల్డ్ సీఐబీ క్వార్టర్స్

● అర్ధరాత్రి వేళ పత్తా లేని జీహెచ్ఎంసీ, హైడ్రా
● మండిపడుతున్న జనాలు


ఓల్డ్ సీఐబీ క్వార్టర్స్‌లో వీధి పొడవునా నిలిచిపోయిన వర్షంనీరు


మోటరు పంపుల ద్వారా వర్షం నీటిని పంపుతున్న సిబ్బందితో కార్పొరేటర్ విజయారెడ్డి, అధికారులు

ఖైరతాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ ఓల్డ్ సీబీ క్వార్టర్స్, ఎంఎస్ మక్తా, మారుతీనగర్, రాజ్‌నగర్‌లలోని వీధుల్లోకి వరద నీరు చేరింది. కొన్ని ఇళ్లలో వస్తువులన్నీ తడిసిపోయాయి.

కొత్త మోటర్లు ఎందుకు పనిచేయలేదు..?

ఓల్డ్ సీబీ క్వార్టర్స్‌లో ఇటీవలే మూడున్నర కోట్ల రూపాయలతో వర్షం నీరు నిలిచే ప్రాంతాల నుంచి పెద్ద పైపులు వేసి వాటి ద్వారా వచ్చే నీరు నిలిచేలా భారీ సంపును నిర్మించారు. అందులో మోటర్లను ఏర్పాటు చేసి వర్షం పడగానే వాటిని ఆన్ చేస్తే సంపులోని నీరు వెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు. కాగా, బుధవారం రాత్రి పెద్ద ఎత్తున నీరు నిలిచినా, మున్సిపల్ సిబ్బందిగాని, హైడ్రా సిబ్బందిగాని రాకపోవడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఉదయం 8 గంటల తర్వాత హైడ్రా సిబ్బంది వచ్చి మోటర్లు ఆన్ చేస్తే పనిచేయడం లేదు. దీంతో వేరే మోటర్లను తెచ్చి నీటిని రోడ్డు మీదకు వదిలారు. సాయంత్రం ఇక నీరు మొత్తం పోతుందనుకునేసరికి మరోసారి వర్షం పడడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది.

ఇంజనీరింగ్ అధికారులపై ఆగ్రహం

ప్రభుత్వ సొమ్మును పక్కా ప్రణాళికలు లేకుండా ఖర్చు చేశారని, కోట్ల రూపాయలు ఖర్చు చేసినా వర్షపు నీరు ఎందుకు వెళ్లలేదని స్థానికులు ఇంజనీరింగ్ అధికారులపై విరుచుకుపడ్డారు. కార్పొరేటర్ విజయారెడ్డితో కలిసి నీటిని పంపింగ్ చేస్తున్న ప్రాంతానికి వచ్చిన డీఈ చైతన్యను నాయకులు, స్థానికులు నిలదీశారు. కాగా, కొత్తగా ఏర్పాటైన రెండు మోటర్లలో ఒకటి చోరీ అయిందని, మరొకటి సరిగ్గా ఆపరేట్ చేయక పనిచేయడం లేదని అధికారులు తెలిపారు.

వర్షం వస్తే.. ఈ దారి ప్రాణాంతకం

● వరద ముంపులో బల్కంపేట-బేగంపేట లింక్ రోడ్డులోని రైల్వే అండర్ బ్రిడ్జి
● చిన్నపాటి వర్షానికే పది అడుగుల మేర వరదనీరు


బల్కంపేట సబ్ వే బ్రిడ్జిలోకి భారీగా చేరిన వరదనీరు


నీటిని తోడిపోసేందుకు కొత్త మోటరు ఏర్పాటు చేస్తున్న అధికారులు

బేగంపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చిన్నపాటి వర్షానికే భారీగా వరదనీరు చేరుతోంది. అదమరచి వెళ్తే ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. బల్కంపేట నుంచి బేగంపేట వెళ్లే లింక్ రోడ్డులో రెండువైపులా రైల్వే అండర్ బ్రిడ్జిలను నిర్మించారు. ఇటు నుంచే వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. బేగంపేట నుంచి సనత్‌నగర్, ఫతేనగర్, బాలానగర్ వెళ్లే వాహనదారులకు దగ్గర దారి కావడంతో ఇటు వైపు నుంచి నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. సమీపంలో నాలాలు ఉండడంతో పాటు అండర్ బ్రిడ్జి కిందకు ఉండడంతో చిన్నపాటి వర్షం పడినా భారీగా వరదనీరు నిలుస్తోంది. గతంలో ఓ కారు, డీసీఎం మునిగిపోయినా ప్రాణ నష్టం జరగలేదు. అప్పట్లో స్థానికులు తాడు సహాయంతో అందులో చిక్కుకున్న వారిని రక్షించారు. బుధవారం కురిసిన వర్షానికి దగ్గర దారని పని ముగించుకొని ఇంటికి బయలు దేరిన ఓ యువకుడు రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి వెళ్తూ నీటిలో మునిగి చనిపోయాడు. భారీగా కురిసిన వర్షానికి అండర్ బ్రిడ్జి పూర్తిగా నీట మునిగింది.

నీటిని ఎత్తి పోయాల్సిందే

రైల్వే అండర్ పాస్ వద్ద నీరు చేరితే రెండు మోటర్లను ఏర్పాటు చేసి అధికారులు ఎత్తిపోస్తారు. 10హెచ్‌పీ, 12హెచ్‌పీ మోటర్లు నిత్యం ఇక్కడ అందుబాటులో ఉంటాయి. వర్షం పడిన వెంటనే సిబ్బంది ఈ రెండు మోటర్లను ఆన్ చేసి నీటిని సమీపంలోని కూకట్‌పల్లి నాలాలోకి ఎత్తిపోస్తారు.

సకాలంలో మోటర్లు ఆన్ చేయని సిబ్బంది

బుధవారం భారీగా నీరు చేరినా మోటర్లను ఆన్ చేసేందుకు సిబ్బంది రాలేదని స్థానికులు తెలిపారు. ఆలస్యంగా సిబ్బంది రావడంతో అప్పటికే ఒక మోటారులోకి నీరు చేరడంతో అది పాడైంది. ఉన్న ఒక్క మోటరుతోనే నీటిని తోడిపోశారని, గురువారం ఈ ప్రాంతాన్ని సందర్శించడానికి వచ్చిన అధికారులకు స్థానికులు తెలిపారు. పాడైన మోటరు స్థానంలో అప్పటికప్పుడు కొత్త మోటరును అధికారులు అందుబాటులో ఉంచారు.

రాకపోకలు నిలిపేయాలి

వర్షం పడితే అండర్ బ్రిడ్జిలోకి భారీగా వరద నీరు చేరుతోందని, రెండువైపులా బారికేడ్లను ఏర్పాటు చేయడంతోపాటు వాహనాల రాకపోకలను నిలిపివేయడం వల్ల ప్రమాదాలను నివారించవచ్చని స్థానికులు అంటున్నారు. కేవలం బారికేడ్లను ఏర్పాటు చేసి అధికారులు వెళ్లిన వెంటనే వాహనదారులు మరోవైపు నుంచి ఇటు రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వారు చెబుతున్నారు.


బల్కంపేట అండర్ బ్రిడ్జి ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తలసాని

మృతుడి కుటుంబానికి రూ.10 లక్షలు ఇవ్వాలి

బేగంపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట నుంచి బేగంపేట వైపు వచ్చే రోడ్డులో గల రైల్వే అండర్ బ్రిడ్జి కింద నీటిలో మునిగి ముషీరాబాద్‌కు చెందిన యువకుడు ఎండి షరీఫుద్దీన్(27) మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ గురువారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. బ్రిడ్జి కింద లైట్లు లేవని, వరదనీరు చేరినప్పుడు వాహనదారులు ఇటు వైపు రాకుండా చేయడంలో అధికారులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కొలను బాల్‌రెడ్డి, టి.శ్రీహరి, ఖలీల్ బేగ్, అధికారులు పాల్గొన్నారు.


బ్యాగులు పంపిణీ చేస్తున్న విజయలక్ష్మియాదవ్

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

బోరబండ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు కంచర్ల విజయలక్ష్మి యాదవ్ స్కూల్ బ్యాగులను అందజేశారు. బలహీనవర్గాల కాలనీ ఉర్దూ మీడియం స్కూల్, శ్రీరాంనగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు దాదాపు 500 బ్యాగులను గురువారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద విద్యార్థులు చదివే ప్రభుత్వ పాఠశాలల్లో సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు చె ప్పారు త్వరలో మరిన్ని కార్యక్రమాలు చేపడతానని ఆమె వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు మీనాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'గడప గడపకూ మాగంటి ఆశయాలను తీసుకెళ్తా'

వెంగళరావునగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గడప గడపకూ దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆశయాలను తీసుకెళ్తానని సతీమణి సునీత అన్నారు. గురువారం వెంగళరావునగర్ డివిజన్ యాదగిరినగర్‌లో 'గడప గడపకూ మాగంటి గోపీనాథ్ ఆశయాలు' కార్యక్రమాన్ని ఆమె స్థానిక కార్పొరేటర్ దేదీప్యవిజయ్‌తో కలిసి ప్రారంభించారు. ఉప ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని ఆమె కోరారు.

ఫిలింనగర్‌లో స్వచ్ఛభారత్ అభియాన్

బంజారాహిల్స్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదిన సేవాపక్షంలో భాగంగా జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ గౌతమ్ నగర్ చౌరస్తాలో గురువారం స్వచ్ఛ భారత్ అభియాన్ నిర్వహించారు. బస్తీలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పారిశుధ్య కార్మికుడు తిరుపతయ్యను సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు వల్లెపు శంకర్, జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్, గణేశ్ యాదవ్, దండుగుల శేఖర్, దొంగరి రాజకళ పాల్గొన్నారు.

బాలికను వేధించిన యువకుడిపై పోక్సో కేసు

బోరబండ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన బాలికను ప్రేమించమంటూ వేధించిన యువకుడిపై బోరబండ ఠాణాలో పోక్సో కేసు నమోదైంది. బోరబండ ప్రాంతానికి చెందిన బాలికకు కొన్నాళ్ల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో యాప్రాల్‌కు చెందిన సిద్ధార్థ అనే యువకుడు పరిచయమయ్యాడు. తనను ప్రేమించాలంటూ వేధిస్తుండడంతో బాలిక తల్లిదండ్రులకు చెప్పింది. బాలిక కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు బోరబండ పోలీసులు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హైదరాబాద్ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

● మేయర్ గద్వాల్ విజయలక్ష్మి


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ అభివృద్ధి పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్.12 ఎమ్మెల్యే కాలనీలో రూ.13 లక్షలతో తాగునీటి పైప్‌లైన్, రూ.10 లక్షలతో మురుగునీటి పైప్‌లైన్, రూ.25 లక్షలతో స్థానిక పార్కులో యోగా సెంటర్ షెడ్ నిర్మాణం, రోడ్డు నెంబర్.12 ఎన్‌బీటీనగర్‌లో రూ.29 లక్షలతో తాగునీటి పైపులైన్, మహేశ్వరి టవర్స్ వద్ద రూ.42 లక్షలతో తాగునీటి పైప్‌లైన్ పనులకు గురువారం మేయర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరాన్ని మోడల్‌గా తీర్చిదిద్దాలనే సంకల్పంతో సీఎం రేవంత్‌రెడ్డి అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలో వర్షాకాలం సమస్యలు పరిష్కరించేందుకు అధ్యయనం చేసి తగిన చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు


ఎస్పీఆర్ హిల్స్‌లో పాదయాత్ర చేస్తున్న వివేక్‌వెంకటస్వామి

బోరబండ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి తెలిపారు. మార్నింగ్ వాక్ విత్ బూత్ కమిటీ మెంబర్స్ కార్యక్రమంలో భాగంగా రహ్మత్ నగర్ డివిజన్ పరిధిలోని బస్తీల్లో గురువారం ఆయన పర్యటించారు. డివిజన్ పరిధిలో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, త్వరలో మరిన్ని పనులు ప్రారంభిస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ అజారుద్దీన్, కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సయ్యద్ నిజాముద్దీన్, వి.నవీన్ యాదవ్, బి.భవానీ శంకర్, వివిధ బస్తీల నాయకులు పాల్గొన్నారు.

'సినీ కార్మికులకు అండగా ఉంటా'

యూసుఫ్‌గూడ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సినీ కార్మికులకు అండగా ఉంటానని కాంగ్రెస్ పార్టీ నేత వి.నవీన్ యాదవ్ అన్నారు. నూతనంగా ఎన్నికైన తెలుగు సినీ స్టూడియో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వీరేశం, కోశాధికారి ఉపేందర్‌లు గురువారం ఆయనను మర్యాద పూర్వకంగా కార్యాలయంలో కలిశారు. స్టూడియో కార్మికుల సమస్యలపై కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామితో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పీపుల్స్‌ప్లాజాలో గ్రాండ్ నర్సరీ మేళా


స్టాల్‌ను పరిశీలిస్తున్న యాస్మిన్ బాషా

ఖైరతాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పీవీ నరసింహారావు మార్గంలోని పీపుల్స్‌ప్లాజాలో 18వ గ్రాండ్ నర్సరీ మేళా పేరిట ఏర్పాటైన ఆలిండియా హార్టికల్చర్ ప్రదర్శనను గురువారం ఉద్యానవన శాఖ కమిషనర్ యాస్మిన్ బాషా ప్రారంభించారు. ఇందులో మెడిసినల్ ప్లాంట్లు, కిచెన్, ఔట్ డోర్, బల్బ్స్, సీడ్లింగ్స్, ఇండోర్, ఆడినియం, బోన్సాయ్, క్లిపర్స్, ఫ్లవర్, ఇంపోర్టెడ్ ప్లాంట్లు, ఎగ్జాటిక్ ప్లాంట్స్, వాటర్ లిల్లీస్, కోకోపీట్, గార్డెన్ ఎక్విప్‌మెంట్, ఫామ్ ఎక్విప్‌మెంట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రదర్శన ఈనెల 22 వరకు ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకుడు ఖాలిద్ అహ్మద్, సందర్శకులు పాల్గొన్నారు.


వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్ కాలనీకి చెందిన టీవీ మమతకు ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు అందజేసి సన్మానిస్తున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

● పంజాగుట్ట, ఆంధ్రజ్యోతి

22 నుంచి శరన్నవరాత్రి వేడుకలు


జూబ్లీహిల్స్ శ్రీ పెద్దమ్మ తల్లి

బంజారాహిల్స్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయంలో ఈనెల 22 నుంచి శరన్నవరాత్రి వేడుకలు జరగనున్నాయి. మొదటి రోజు ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించిన అనంతరం అంకురార్పణ, పుణ్యాహవచం, అగ్నిమధనం, క్షేత్రపాలక నవగ్రహ సహిత సర్వతోభద్ర మండప దేవతాహ్వానములు జరుగుతాయి. అనంతరం అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించి పూజాదికాలు నిర్వహిస్తారు. ఈనెల 23న గాయత్రిదేవి, 24న గజలక్ష్మీదేవి, 25న అన్నపూర్ణాదేవి, 26న లలితాదేవి, 27న రాజరాజేశ్వరిదేవి, 28న స్కందమాతాదేవి, 29న సరస్వతీదేవి, 30న దుర్గాదేవి, అక్టోబరు 1న మహిషాసురమర్ధినిదేవి, 2న పెద్దమ్మ తల్లి అలంకరణ చేస్తారు. ఆలయానికి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

శ్రీ సాయి నామ శత కోటి మహా జప యజ్ఞం

పంజాగుట్ట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్ శ్రీ షిర్డీ సాయి బాబా సంస్థాన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి ఫిబ్రవరి 4 వరకు శ్రీ సాయి నామ శత కోటి మహా జప యజ్ఞం నిర్వహిస్తున్నామని ట్రస్టు అధ్యక్షుడు బీవీ శ్యామ్ కుమార్ తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ట్రస్టు ప్రధానకార్యదర్శి రఘు కుమార్, కోశాధికారి నరసింహ గుప్తా యజ్ఞానికి సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించి వివరాలు వెల్లడించారు. లోక కల్యాణార్థం, భక్తుల కోరిక మేరకు జరుగుతున్న ఈ జప కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని కోరారు. సాయి నామ జప యజ్ఞం కార్యక్రమాన్ని పూర్తి చేసే వారు సామాజిక మాధ్యమాల్లో తెలియజేసేందుకు ప్రత్యేక వాట్సాప్ నంబర్ 8500966566, 9492646780ను ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థాన్ మాజీ చైర్మన్ జి.మల్లయ్య, శ్రవణ్ కుమార్, స్వామిజీ, స్వరూప్ పాల్గొన్నారు.

వరద ప్రాంతాల్లో కార్పొరేటర్ పర్యటన



వరద ప్రాంతంలో పర్యటిస్తున్న కార్పొరేటర్ సునీత

చిలకలగూడ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మెట్టుగూడలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి విజయపురి కాలనీ, ఏపీ రైస్ స్టోర్స్, దూద్‌బావి తదితర ప్రాంతాల్లో వరద నీరు ఇళ్లల్లోకి చేరింది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ రాసూరి సునీత గురువారం ఆయా ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించి, ఎటువంటి ప్రాణాపాయం జరగకుండా చర్యలు చేపట్టారు. జోనల్ కమిషనర్‌తో మాట్లాడి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు.



వైద్య శిబిరంలో పాల్గొన్న ఫ్యామిలీ ప్లానింగ్ అదనపు కమిషనర్ డాక్టర్ ఇందు గ్రేవాల్, సూపరింటెండెంట్ డాక్టర్ వాణి

గాంధీలో వైద్య శిబిరం

అడ్డగుట్ట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గాంధీ ఆస్పత్రిలో గురువారం చిన్నపిల్లల వార్డులో నిర్వహించిన స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్ వైద్య శిబిరంలో ఫ్యామిలీ ప్లానింగ్ అదనపు కమిషనర్ డాక్టర్ ఇందు గ్రేవాల్, సూపరింటెండెంట్ డాక్టర్ వాణిలు పాల్గొన్నారు. చిన్నపిల్లల వార్డులో చిన్నారులకు ఉచితంగా వైద్య సేవలందించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ సునీల్‌కుమార్, ఆర్ఎంఓ కల్యాణచక్రవర్తి, డాక్టర్ శేషాద్రి, చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ వాసుదేవ్, డాక్టర్ అజయ్ మోహన్, డాక్టర్ రజినిలు పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్‌కు వీడ్కోలు

తిరుమలగిరి సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): బొల్లారం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ బదిలీపై సిటీ సెక్యూరిటీ వింగ్‌కు వెళ్లారు. ఆయన స్థానంలో రవికుమార్ బాధ్యతలను స్వీకరించారు. అయితే కొన్ని సంవత్సరాలుగా బొల్లారం ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన శ్రీనివాస్ స్థానికుల మన్ననలను పొందారు. అందులో భాగంగానే కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జయప్రకాష్ గురువారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి ఆయనకు శాలువా కప్పి, ఘనంగా సత్కరించారు. సమావేశంలో బొల్లారం ఎస్ఐ రామక్రిష్ణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జీవీ బాల్‌రాజ్, వినోద్ కుమార్, కరుణాకర్‌లు ఉన్నారు.

తుకారాంగేట్‌లో స్వచ్ఛ భారత్

అడ్డగుట్ట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సేవాపక్షం కార్యక్రమంలో గురువారం అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షురాలు గాజుల సౌందర్య ఆధ్వర్యంలో డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో ఎక్కడ పడితే అక్కడ పేరుకుపోయిన చెత్తచెదారాన్ని తొలగించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సాయన్న, కన్నాబిరాం, కృష్ణ, వీరేశం, హంసరాజు, కళావతి, రాజశేఖర్ జ్ఞానేశ్వర్, సాయి, విజయ్, దిలీప్, కుమార్, శ్యామ్, గంగారాం, నాగరాజు, శ్రీదర్, వసంత, రాజేష్, మహేష్‌తో పాటు షిరిడి సాయిబాబా హైస్కూలు ప్రిన్సిపాల్ శ్రీదర్, జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



ఆలయంలో హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

మహాకాళి ఆలయంలో హుండీ లెక్కింపు

సికింద్రాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆలయంలో గురువారం ఆలయ కార్యనిర్వహణాధికారి జి.మనోహర్ రెడ్డి, సహాయ కమిషనర్ సికింద్రాబాద్ శ్రీదేవి, ఇన్‌స్పెక్టర్ సురిటీ రామేశ్వర్, ఫౌండర్ ఫ్యామిలీ సభ్యులు భక్తుల సమక్షంలో హుండీలు లెక్కింపు చేయగా రూ.18,90,150నోట్లు, రూ.1,57,597 కాయిన్స్‌లు మొత్తం రూ.20,47,747ల ఆదాయం వచ్చింది. అదేవిధంగా బంగారు 76 గ్రాములు, వెండి 700 గ్రాములు హుండి రూపంలో వచ్చింది.



గంజాయి సరఫరా నిందితుడిని చూపుతున్న జీఆర్‌పీ పోలీసులు

రైల్వేస్టేషన్‌లో 16 కిలోల గంజాయి పట్టివేత

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రైలులో గంజాయి సరఫరా చేస్తున్న నిందితుడిని సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం సికింద్రాబాద్ జీఆర్‌పీ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రైల్వే డీఎస్‌పీ జావెద్ మాట్లాడుతూ, మహారాష్ట్రకు చెందిన అస్రుద్దీన్ టకారిద్దీన్‌ఖాన్(35) సులువుగా డబ్బు సంపాదించేందుకు గంజా యి సరుకును మహారాష్ట్రలోని పలు గ్రామాల్లో విక్రయించాలనుకున్నాడు. అతడు 16న భువనేశ్వర్‌లో 15.5 కిలోల గంజాయిని కొనుగోలు చేసి కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కి మంగళవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. రైల్వేస్టేషన్‌లో జీఆర్‌పీ, ఆర్పీఎఫ్ పోలీసుల తనిఖీలు చేస్తుండగా బోగీలో అనుమానాస్పదస్థితిలో కనిపించిన ఖాన్ వారు ప్రశ్నించి, బ్యాగ్‌ను తనిఖీ చేయగా బ్యాగ్‌లో రూ1.13 లక్షల విలువ చేసే 15.5 కిలోల గంజాయి కనిపించింది. పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.



పండ్లు పంపిణీ చేస్తున్న జేఏసీ చైర్మన్ తిరుపతి

ఓయూ కార్మికులకు పండ్ల పంపిణీ

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా గురువారం ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కాలేజీ వద్ద ఓయూలో పని చేసే కార్మికులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో మొక్కలు నాటారు. ఆది శ్రీనివాస్ రానున్న రోజుల్లో మరింత ఉన్నతమైన పదవులు అధిరోహించాలని కొత్తపల్లి తిరుపతి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దరువు రమేష్, రాజేందర్, సంజయ్, చరణ్, కరుణాకర్, కుమార్, శివ, రాజు, మహేష్, శ్రీనివాస్, నరేష్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



న్యూఅశోక్‌నగర్‌లో చెత్త, మట్టిలో కొట్టుకువచ్చిన బియ్యం



పుల్లయ్యబావిలో ఇంటి నుంచి రోడ్డుపైకి కొట్టుకువచ్చిన వస్తువులు



ఫ్రైడే మార్కెట్ వద్ద ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు కరాటేరాజు



పుల్లయ్యబావిలో రోడ్డుపై చెత్తతో పాటు మురుగు

లష్కర్‌లో దంచికొట్టిన వాన

- ఇళ్లలోకి వర్షపునీరు
- రోడ్లపై చెత్తాచెదారం, బురద

బౌద్ధనగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బుధవారం రాత్రి సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్లో కురిసిన భారీ వర్షానికి బస్తీలు ఇంకా తేరుకోలేదు. ఇళ్లలో బురద పేరుకుపోవడం. వర్షపునీరు నిల్వ ఉండటంతో ఆయా ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బస్తీలో రోడ్లపై పేరుకుపోయిన చెత్తను తొలగించటం లేదని, కనీస మరమ్మతులు చేయటం లేదని అధికారులు, కార్పొరేటర్లు పత్తాలేరని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బౌద్ధనగర్ డివిజన్ పరిధిలోని ప్రాంతాలు బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ముంపుకు గురయ్యాయి. ఇళ్లలోకి వర్షపునీరు చేరటంతో ఇంట్లోని సామాగ్రి కొట్టుకుపోయాయి. గురువారం ఉదయం వర్షం తగ్గినా వర్షపునీరు పారుతూనే ఉన్నాయి. ఇళ్లల్లో బురద, చెత్తాచెదారం పేరుకుపోయింది. పరుపులు, విలువైన సామాగ్రి వర్షపునీటిలో రోడ్లపైకి వచ్చాయి. బుధవారం రాత్రి నుంచి కంటి మీద కునుకు లేదని, భారీవర్షంతో చాలా నష్టపోయామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఇళ్లలోకి వర్షపునీరు వస్తుందని సికింద్రాబాద్ నియోజకవర్గ బీజేపీ అధికార ప్రతినిధి ప్రభుగుప్తా ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం శ్రీనివాస్‌నగర్‌లో నాలా వద్ద రోడ్డుపై కుర్చీ వేసుకుని నిరసన వ్యక్తం చేశారు. మహ్మద్‌గూడ, శ్రీనివాస్‌నగర్ తదితర ప్రాంతాల్లో సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కరాటేరాజు, జాకీర్ తదితరులు పర్యటించి స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాల బారిన పడినవారికి తగిన న్యాయం చేస్తామని వారు తెలిపారు.

ఆజాద్‌చంద్రశేఖర్‌నగర్‌లో..

అడ్డగుట్ట ఆజాద్‌చంద్రశేఖర్‌నగర్ బస్తీలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి ఎన్నడు లేని విధంగా రోడ్లు జలమయమవడంతో బస్తీవాసులు బయటికి రాలేదు. తెల్లవారుజామున వరకు నీరు బయటికి పోకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. ఈ బస్తీలోని రామాలయం వెనుక వైపున ఉన్న సెప్టిక్ ట్యాంక్ ఒక్కసారిగా కూలిపోవడంతో బస్తీవాసులు భయాందోళనకు గురయ్యారు.



శ్రీనివాస్‌నగర్‌లో నాలా వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకుడు ప్రభు గుప్తా

చిలకలగూడలో..

మెట్టుగూడలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి జలమయమైన ప్రాంతాలను కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఆదం సంతోష్ కుమార్ పర్యటించి బాధితులను గురువారం పరామర్శించి సహాయ సహకారాలు అందజేయటానికి తగు చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. డివిజన్ పరిధిలోని దూద్‌బావి, ఆలుగడ్డబావి, ఏపీ రైస్ డిపో తదితర ప్రాంతాల్లో పర్యటన సాగింది.

మారేడుపల్లిలో..

కంటోన్మెంట్ పరిధి నాలుగో వార్డులో ఎల్ఐసీ కాలనీ మీదుగా ఓపెన్ మురుగునీటి కాలువపై నిర్మించిన 150 పీట్ల ప్రహరీ వరద నీటి ధాటికి కూలిపోయింది. అలాగే ప్లాట్ నంబర్ 8లో గల భారీవృక్షం పక్కనే ఉన్న రేకుల షెడ్డుపై కూలడంతో రేకులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ద్విచక్ర వాహనంపై కూలడంతో వాహనం దెబ్బతిండి. పలు అపార్ట్‌మెంట్ల సెల్లార్లలో వరద నీరు చేరడంతో కార్లు వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. గురువారం ఉదయం కంటోన్మెంట్ బోర్డ్ ఉన్నత అధికారులు ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే కూలిపోయిన వృక్షాన్ని తొలగించడానికి చర్యలు చేపట్టారు. శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ చౌహాన్ అధికారులు పాల్గొన్నారు.



కూలిపోయిన ఓపెన్ నాలాకు ఇరువైపులా నిర్మించిన ప్రహరీ

నీట మునిగిన ప్యాట్నీ నగర్

సికింద్రాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లోని ప్యాట్నీనగర్ మరోసారి ముంపుకు గురైంది. బుధవారం రాత్రి కురిసిన కుండపోత వర్షానికి ప్యాట్నీనగర్‌లోని ఇళ్ళు, వర్తక, వాణిజ్య సంస్థల భవనాల కింది అంతస్తుల్లోకి పెద్దఎత్తున వరదనీరు చేరింది. కాగా ప్యాట్నీనగర్ కాంపౌండ్ రోడ్డు వర్షపునీటితో నిండటంతో.. ఈ కాంపౌండ్‌లోని సంస్థలు, ప్రైవేటు కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు గురువారం ఉదయం కార్యాలయాల్లోకి వెళ్లేందుకు ఇబ్బందులకు గురయ్యారు.



ఆజాద్‌చంద్రశేఖర్‌నగర్ బస్తీలో వర్షానికి కూలిపోయిన సెప్టిక్ ట్యాంకు

వర్షానికి దెబ్బతిన్న పంప్‌హౌస్

- రెండురోజుల పాటు నీటి సరఫరా బంద్



వర్షపునీరుతో మునిగిన బలంరాయి పంప్‌హౌస్

సికింద్రాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్‌లోని పలు కాలనీలు, బస్తీలకు తాగునీరు సరఫరా చేసే బలంరాయి పంప్‌హౌస్‌కు వరుణుని దెబ్బ తాకింది. బుధవారం రాత్రి కురిసిన వర్షం కారణంగా పక్కనే ఉన్న నాలా నుంచి వరద నీరు పొంగి పంప్‌హౌస్‌ను ముంచెత్తింది. దీంతో పంప్‌హౌస్‌లోని మోటార్లు, యంత్రాలు నీట మునగడంతో తాగునీటి సరఫరాను బంద్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరమ్మతులు చేయాల్సి ఉన్నందున ఈ పంప్‌హౌస్ పరిధిలోని బస్తీలు, కాలనీలకు రెండురోజుల పాటు నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు కంటోన్మెంట్ బోర్డు తాగునీటి విభాగం సూపరింటెండెంట్ రాజ్‌కుమార్ తెలిపారు.





వర్షపు నీటితో ప్యాట్నీనగర్



ఎల్ఐసీ కాలనీలో కూలిన భారీ వృక్షం



నాలాకు ఇరువైపులా కూలిపోయిన ప్రహరీ



మెట్టుగూడలో పర్యటిస్తున్న ఆదం సంతోష్ కుమార్



న్యూఅశోక్ నగర్‌లో ఇంటిలో వెళ్లిన వర్షపు నీరు, బురదను చూపిస్తున్న మహిళ

కలకలం సృష్టించిన చిన్నారి అదృశ్యం ఘటన

గంటలోపే ఆచూకీ కనిపెట్టిన తుకారాంగేట్ పోలీసులు

అడ్డగుట్ట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు ఆడుకుంటున్న మూడేళ్ల చిన్నారి అదృశ్యమైన ఘటన తుకారంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం కలకలం సృష్టించింది. విషయం తెలుసుకున్న పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గంటలోపే చిన్నారి ఆచూకీ కనిపెట్టారు. దాంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. గోపాలపురం ఏసీపీ సుబ్బయ్య తెలిపిన వివరాలు ప్రకారం నేపాల్‌కు చెందిన కిషన్ నిర్మల్ దంపతులు నెల రోజుల క్రితం మారేడుపల్లిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేయడానికి వచ్చారు. వారికి ఇద్దరు కూతుళ్లు. కాగా మూడేళ్ల కూతురు ప్రిన్సీ గురువారం సాయంత్రం మూడు గంటల సమయంలో ఇంటి ముందు ఆడుకుంటూ కనిపించకుండా పోయింది. దాంతో కంగారుపడిన తల్లి అపార్ట్‌మెంట్ దిగి కిందికి వచ్చి కూతురుకోసం ఆరా తీసింది. ఎక్కడా కనిపించకపోవడంతో డయల్-100కు ఫోన్ చేసి తుకారాంగేట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. నిమిషాల్లోనే గోపాలపురం ఏసీపీ సుబ్బయ్య, తుకారాంగేట్ సీఐ శ్రీకాంత్ రెడ్డితో పాటు ఎస్సైలు కానిస్టేబుళ్లు శ్రీను, సాయి కుమార్, అశోక్, హరిబాబు వీరేష్, లచ్చిరాం, గణేష్, శివలు మూడు బృందాలుగా విడిపోయారు. దర్యాప్తు ప్రారంభించారు.

- ఏడుస్తుందని ఎత్తుకొని ఓదార్చిన వృద్ధురాలు

ఘటన స్థలానికి వచ్చిన పోలీసులు అపార్ట్‌మెంట్‌లో సీసీ పుటేజీలను పరిశీలించారు. ఎదురుగా ఉన్న అపార్టుమెంట్‌లో పనిచేస్తున్న వృద్ధురాలు.. బయట రోడ్డుమీద ఏడుస్తున్న చిన్నారిని గమనించింది. దాంతో ఆ వృద్ధురాలు చిన్నారిని ఎత్తుకుని పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌లో చిన్నారి తల్లిదండ్రుల గురించి వాచ్‌మెన్‌లను వాకబు చేసినా ఫలితం లేకపోయింది. ఇక లాభం లేదని ఏడుస్తున్న చిన్నారిని ఎత్తుకొని తాను పనిచేస్తున్న ఇంటికి తీసుకెళ్లి భోజనం తినిపించింది. ఈ లోగా సీసీ పుటేజీలో వృద్ధురాలి వివరాలు సెల్ నెంబరు సేకరించిన పోలీసులు వృద్ధురాలికి ఫోన్ చేయడంతో చిన్నారి తన వద్దే ఉందని చెప్పింది. వెంటనే అపార్ట్‌మెంట్‌కు తీసుకొచ్చి పోలీసులకు అప్పగించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు ఆ చిన్నారిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఏసీపీ సుబ్బయ్య టీమ్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.



మూడేళ్ల బాలికను రక్షించిన తుకారాంగేట్ పోలీసులు

వర్షం వస్తే.. ఈ దారి ప్రాణాంతకం

- వరద ముంపులో బల్కంపేట-బేగంపేట లింక్ రోడ్డులోని రైల్వే అండర్ బ్రిడ్జి
- చిన్నపాటి వర్షానికే పది అడుగుల మేర వరదనీరు

బేగంపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చిన్నపాటి వర్షానికే భారీగా వరదనీరు చేరుతోంది. అదమరచి వెళ్తే ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. బల్కంపేట నుంచి బేగంపేట వెళ్లే లింక్ రోడ్డులో రెండువైపులా రైల్వే అండర్ బ్రిడ్జిలను నిర్మించారు. ఇటు నుంచే వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. బేగంపేట నుంచి సనత్‌నగర్, ఫతేనగర్, బాలానగర్ వెళ్లే వాహనదారులకు దగ్గర దారి కావడంతో ఇటు వైపు నుంచి నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. సమీపంలో నాలాలు ఉండడంతోపాటు అండర్ బ్రిడ్జి కిందకు ఉండడంతో చిన్నపాటి వర్షం పడినా భారీగా వరదనీరు నిలుస్తోంది. గతంలో ఓ కారు, డీసీఎం మునిగిపోయినా ప్రాణ నష్టం జరగలేదు. అప్పట్లో స్థానికులు తాడు సహాయంతో అందులో చిక్కుకున్న వారిని రక్షించారు. బుధవారం కురిసిన వర్షానికి దగ్గర దారని పని ముగించుకొని ఇంటికి బయలు దేరిన ఓ యువకుడు రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి వెళ్తూ నీటిలో మునిగి చనిపోయాడు. భారీగా కురిసిన వర్షానికి అండర్ బ్రిడ్జి పూర్తిగా నీట మునిగింది.



బల్కంపేట సబ్ వే బ్రిడ్జిలోకి భారీగా చేరిన వరదనీరు

నీటిని ఎత్తి పోయాల్సిందే

రైల్వే అండర్ పాస్ వద్ద నీరు చేరితే రెండు మోటార్లను ఏర్పాటు చేసి అధికారులు ఎత్తిపోస్తారు. 10హెచ్‌పీ, 12హెచ్‌పీ మోటార్లు నిత్యం ఇక్కడ అందుబాటులో ఉంటాయి. వర్షం పడిన వెంటనే సిబ్బంది ఈ రెండు మోటార్లను ఆన్ చేసి నీటిని సమీపంలోని కూకట్‌పల్లి నాలాలోకి ఎత్తిపోస్తారు.

సకాలంలో మోటర్లు ఆన్ చేయని సిబ్బంది

బుధవారం భారీగా నీరు చేరినా మోటర్లను ఆన్ చేసేందుకు సిబ్బంది రాలేదని స్థానికులు తెలిపారు. ఆలస్యంగా సిబ్బంది రావడంతో అప్పటికే ఒక మోటారులోకి నీరు చేరడంతో అది పాడైంది. ఉన్న ఒక్క మోటారుతోనే నీటిని తోడిపోశారని, గురువారం ఈ ప్రాంతాన్ని సందర్శించడానికి వచ్చిన అధికారులకు స్థానికులు తెలిపారు. పాడైన మోటరు స్థానంలో అప్పటికప్పుడు కొత్త మోటరును అధికారులు అందుబాటులో ఉంచారు.

రోడ్డు బంద్ చేయాలి

వర్షం పడితే అండర్ బ్రిడ్జిలోకి భారీగా వరద నీరు చేరుతోందని, రెండువైపులా బారికేడ్లను ఏర్పాటు చేయడంతోపాటు వాహనాల రాకపోకలను నిలిపివేయడం వల్ల ప్రమాదాలను నివారించవచ్చని స్థానికులు అంటున్నారు. కేవలం బారికేడ్లను ఏర్పాటు చేసి అధికారులు వెళ్లిన వెంటనే వాహనదారులు మరోవైపు నుంచి ఇటు రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వారు చెబుతున్నారు.



ముంపుకు గురైన ప్రాంతాల్లో పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

వరద నీటి సమస్య పరిష్కారానికి చర్యలు : ఎమ్మెల్యే

మారేడుపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి నియోజకవర్గంలో దెబ్బతిన్న పలు కాలనీలు, బస్తీలను ఎమ్మెల్యే గణేశ్ సందర్శించారు. నియోజకవర్గంలోని 150 డివిజన్ అంబేడ్కర్‌నగర్ బస్తీ, వార్డ్ 5 ఏఓసీ అపార్ట్‌మెంట్ రెసిడెన్సీ, వాసవీ కాలనీ, గృహలక్ష్మీ కాలనీ, వార్డు 4 లక్ష్మీనగర్, పికెట్ సుబ్బారావు కాలనీల్లో స్థానిక నాయకులు, అధికారులతో కలిసి పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో మాట్లాడి సత్వర పరిష్కార చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇసుక, మురుగు నీరు, బురద, బస్తీ/కాలనీల అంతర్గత రోడ్లలో చేరడంతో అపరిశుభ్రత ఏర్పడిందని, దీనికి పరిష్కార చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. నాయకులు తేలుకుంట సతీష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



నల్లపోచమ్మ ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జంపన ప్రతాప్

పోచమ్మ ఆలయంలో అన్నదానం

బోయినపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అన్నదానం మహా ప్రసాదం అనేది అన్నదానం గొప్పతనాన్ని సూచిస్తుంది. ఎందుకంటే అన్నం పరబ్రహ్మ స్వరూపం అని నమ్ముతారు కాబట్టి దానిని దానం చేయడం అత్యంత పుణ్యకరమని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నారు. ఈ నేపథ్యంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ పృథ్వీనాధ్ సతీమణి వర్ధంతిని పురస్కరించుకుని వారి కుటుంబ సభ్యులు గురువారం బోయినపల్లి నల్ల పోచమ్మ ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జంపన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు అనీల్, సునీల్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఏలే కిరణ్ కుమార్‌కు డాక్టరేట్

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి) : మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ ఏలే కిరణ్ కుమార్ ఉస్మానియా యూనివర్సిటీ ప్రతిష్టాత్మక డాక్టరేట్ పట్టాను పొందారు. 'ఏ స్టడీ ఆన్ లెర్నింగ్ మ్యాథమెటిక్స్ ఎట్ సెకండరీ లెవెల్ ఇన్ మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ ఆఫ్ తెలంగాణ స్టేట్' అనే అంశంపై డాక్టర్ పారిపల్లి శంకర్ పర్యవేక్షణలో ఓయూలోని ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లో పరిశోధన పూర్తి చేశారు. ఆయన 2019లో మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల దేవరకొండలో పీజీటీగా ఉద్యోగం సాధించారు. తిరిగి 2021లో గ్రేడ్ టు ప్రిన్సిపాల్‌గా ఉద్యోగం సాధించి మహాత్మ జ్యోతిబాపూలే చిట్యాలలో పని చేశారు. 2024లో గ్రేడ్ వన్ ప్రిన్సిపాల్‌గా ప్రమోషన్ పొంది ప్రస్తుతం మహాత్మ జ్యోతిబాపూలే గోషామహల్ కాలేజీలో కొనసాగుతున్నారు.